చైతన్య ప్రభువు చెప్పినట్లే చేసాడా తండ్రి. కొద్ది రోజుల్లోనే అతని కొడుకులోని భక్తి మాయమై మామూలు వాడయ్యాడు.

ఎవరైతే దేవుడి సొమ్ము తింటారో వాళ్ళకి అంటే పాపం అసాధారణమైన పాపం. ఆ ఘోర పాపం వదలడానికి ఎన్నో నికృష్ట జన్మలు ఎత్తాల్సి వుంటుంది. అలాగే సన్యాసి సొమ్ము తినేవాడికి కూడా ఘోరమైన పాపం అంటుకుంటుంది.

(మన ఎండోమెంట్స్ శాఖలో పనిచేసే ఉద్యోగస్థులందరి దృష్టిలో ఈ 'మంచి మాట' పడుతుందని ఆశిద్దాం.)

## 77. జ్ఞానార్థి

ఓ వ్యక్తి తత్త్వ జ్ఞానం సంపాదించడానికి దేశాటనకి బయలుదేరాడు. దారిలో అతను ఓ బీదవాడి ఇంటి బయట అరుగు మీద బస చేసాడు. అతని పొరుగున ఉన్న ఓ ధనవంతుడు తన కూతురి వివాహానికి వీరిద్దరినీ ఆహ్వానించాడు. ఇద్దరూ భోజనానికి ఒకే పంక్తిలో పక్కపక్కనే కూర్చున్నారు. శుద్ధమైన నెయ్యితో చేసిన రుచికరమైన లడ్డూలు వడ్డించారు. బీదవాడు వాటిని తృప్తిగా తిన్నాడు. ఇంకా తినాలని ఉన్నా మొహమాట పడి మారు అడగలేదు. ఇద్దరూ ఇంటికి తిరిగి వచ్చాక ఆ బీదవాడి మనసు లడ్డూల మీదకి పోయింది.

తన రెండువారాల సంపాదనని అప్పు తెచ్చుకుని, కావలసిన దినుసులు కొనుక్కువచ్చి భార్యకి ఇచ్చి లడ్డూలు చేయమని కోరాడు. ఎప్పుడు చేయడం పూర్తవుతుందా, ఎప్పుడు తిందామా అని అతను కాచుకున్నాడు. పూర్తయ్యాక భార్య ఇచ్చిన లడ్డూలని ఇరవై నిముషాల్లో తినేసాడు. పధ్నాలుగు రోజుల సంపాదనంతా అరగంటలో నాలిక మీంచి గొంతు జారి కడుపులోకి వెళ్ళింది.

మర్నాడు భార్యతో చెప్పాడా బీదవాడు.

" అప్పు తీరాక మళ్ళీ ఇంకోసారి లడ్డూలు చెయ్యి. మనసు తీరలేదు."

అతనింటి బయట అరుగు మీద బస చేసిన తత్త్వ జ్ఞానార్థికి, తిన్నది మళ్ళీ మళ్ళీ తినాలనిపించే బీదవాడి మనసు యొక్క స్వభావం అర్థం అయింది. ' ఇతను కాదు లడ్డూని తిన్నది. లడ్డూనే ఇతన్ని తిన్నది' అతనికి అనిపించింది.

ఓ సారి రుచిచూస్తే దానిమీదకి మనసు ఎలా పరిగెడుతుందో అర్ధం అవడంతో, అతనికి లోకంలో దొరికే ఆనందాలేవీ మనిషిని ఎప్పటికీ తృప్తి పరచలేవన్న తత్త్వ జ్ఞానం అబ్బింది. మర్నాడు అతను తన ఇంటికి తిరుగు ప్రయాణం అయాడు.

## 78. కొలిమి పరీక్ష

ఓ గ్రామంలోని ఓ నాస్తికుడు, భక్తుడైన తన కంసాలి మిత్రుడి ఇంటికి వెళ్ళాడు. ఆ కంసాలి చాలా కష్టాల్లో ఉన్నాడు కాబట్టి పరామర్శ చేయడానికి వచ్చాడా నాస్తికుడు. కొద్ది సేపయ్యాక చెప్పాడు నాస్తికుడు.

“నాకిది చాలా వింతగా ఉంది. దేవుడ్ని కొలిచే వాళ్ళకి కష్టాలు పోవాలి కాని నీకు అలాంటిదేం జరగడం లేదే? భగవంతుడు లేడని నిన్ను నమ్మమనడం లేదు కాని, దేవుడంటూ ఉంటే మరి ఈ కష్టాల పరంపర నిన్నే ఎందుకు అంటి పెట్టుకుని ఉన్నట్లు? ”

ఆ కంసాలి కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు. తర్వాత నాస్తిక మిత్రుడితో చెప్పాడు.

“ఇదిగో. నేను గుర్రపు నాడాగా మార్చాల్సిన ఇనుప బద్ధీ ఇది. ముందుగా ఈ ముడి ఇనుముని ఏం చేస్తానో తెలుసా? అది దాదాపు నిప్పులా అయేలాగా నిప్పులో కాలుస్తాను. తర్వాత దాన్ని బయటకి తీసి అది నాకు కావాల్సిన పరిమాణంలోకి వచ్చేలా సుత్తితో నిర్దయగా బాదుతాను. తర్వాత దాన్ని చల్లటి నీటిలో పడేస్తాను. మళ్ళీ చల్లారిన దాన్ని నిప్పులో ఎర్రగా కాల్చి మళ్ళీ సుత్తితో దాన్ని బాదుతాను.”

ఆస్తిక మిత్రుడు చెప్పేది నాస్తికుడు శ్రద్ధగా వింటున్నాడు.

“కాని ఒకోసారి ఈ పద్ధతికి తట్టుకోలేని కొన్ని ముడి ఇనుము బద్ధలు నాకు తగులుతూంటాయి. ఆ వేడి, ఆ సుత్తి దెబ్బలు, చన్నీరుకి తట్టుకోలేని అవి గుర్రపు నాడాలని చేయడానికి పనికిరావు. అప్పుడు వాటిని అదిగో, ఆ చెత్త కుప్పలోకి విసిరేస్తాను. ఇంక అవి ఎందుకూ పనికిరావు.”